సాక్షి తూర్పుగోదావరి

సోమవారం । 15 । జూలై । 2024



పెద్దాసుపత్రిలో యమపాశాలు

కాకినాడ పెద్దాసుపత్రిలో విద్యుత్తు తీగల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఇవి రోగులు, ఆసుపత్రి సిబ్బందికి యమపాశాలుగా మారాయి.

8లో



తోటలను ముంచి.. ఆశలను తుంచి

పూలు తోటలకు కష్టాలొచ్చాయి.. ఈ పంటలను భారీ వానలు నిలువునా ముంచేస్తున్నాయి.. దిగుబడి వచ్చే సమయంలో రైతుల ఆశలను తుంచేశాయి.

8లో

వకుళమాత అన్నదాన భవనానికి రూ.51,116 విరాళం



ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి పరుచూరి గిరీష్ నాగకమల్ (విజయవాడ) రూ.51,116 విరాళం అందించారు.

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీకోసం ద్వారా ప్రజల నుంచి సోమవారం అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల స్థాయిలో ఆయా కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులు ప్రజలకి అందుబాటులో ఉండి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామన్నారు.

వరి పంటను రక్షించుకోండి

రాజమహేంద్రవరం రూరల్: వరి నాట్లు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో అధిక వర్షాలకు జిల్లాలోని 10 మండలాల్లోని లోతట్టు గ్రామాలలో 917 హెక్టార్ల వరి పంట ఒక అడుగు వరకు మునిగిందని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాట్లు వేసి 15 నుంచి 16 రోజుల దశలో ఉన్నందున పంటకు సాధారణంగా నష్టం వాటిల్లనప్పటికీ, అధిక నీటిని తక్షణమే తీసే విధంగా డ్రెయినేజీ పారుదల వ్యవస్థను ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. పంట పొలాల్లో నీరు తగ్గిన వెంటనే అత్యవసర చర్యగా ఎకరాకు 20 నుంచి 25 కిలోల యూరియాతో పాటు 10 నుంచి 15 కిలోల పొటాష్ (ఎంఓపీ) బూస్టర్ డోస్‌గా పైరుపై వెదజల్లాలన్నారు. ఈ వాతావరణ పరిస్థితిలో పొడతెగులు ఆశించే అవకాశం ఉంటుంది కనుక, నివారణకు హెక్సా కొనోజోల్ 2 ఎంఎల్ లేదా వాలిడామైసిన్ 2 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పైరు పూర్తిగా తడిసే విధంగా పిచికారీ చేయాల్సి ఉందన్నారు. నాటిన పొలాల్లో ఖాళీలు ఏర్పడితే, మొక్కల సాంద్రత తగ్గకుండా అందుబాటులో వున్న నారుతో ఖాళీలు భర్తీ చేయాలని మాధవరావు తెలిపారు.

జీపీఎస్ గెజిట్ రద్దు చేయకపోతే ఆందోళన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీపీఎస్ గెజిట్‌ని వెంటనే రద్దు చేయకపోతే తీవ్ర ఆందోళన చేస్తామని జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.జయకర్, ఎ.షరీఫ్ తెలిపారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని రద్దు చేయగలిగిన ప్రభుత్వం జీపీఎస్ గెజిట్ ఎందుకు రద్దు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే జీపీఎస్ గెజిట్‌ని రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలల ఉనికిని దెబ్బతీస్తున్న జీవో నంబర్ 117ని కూడా రద్దు చేయాలన్నారు. వెంటనే పాఠశాల విద్యా క్యాలెండర్ ప్రకటించాలని, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు విజయగౌరీ, కోశాధికారి ఐవీవీఎస్ఆర్.ప్రసాద్, జిల్లా కార్యదర్శులు ఈ.శ్రీమణి, ప్రకాష్, రమేష్, దయానిధి, రూపస్‌రావు, రాజేశ్వరి, విజయ్, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.1,56,217 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

గుండెపోటుతో ఏఎస్‌ఐ కృష్ణారావు మృతి



కొత్తపల్లి: గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జి.కృష్ణారావు(59) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. కాకినాడ రాయుడుపాలెంలో తన స్వగృహంలో మృతి చెందారు. కృష్ణారావు నగరం, రాజ ఒమ్మంగి, కాకినాడ 3టౌన్‌తో పాటు పలు పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుల్, రైటర్, సీనియర్ రైటర్, ఏఎస్ఐగా విధులు నిర్వహించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీస్ సిబ్బంది భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

లెక్క తేల్చారు

- జేఎన్‌టీయూకే పరిధిలో సీట్లు ఖరారు
- 2024–24 విద్యా సంవత్సరానికి 159 కళాశాలలకు గుర్తింపు
- ఇంజినీరింగ్‌లో 63 వేల సీట్లకు అనుమతి
- కొత్త కోర్సుల్లో 1,500 అడ్మిషన్లకు ఓకే
- రేపు సీట్ల కేటాయింపు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ ప్రవేశాలకు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విద్యార్థులకు కళాశాలల్లో ప్రవేశాలకు లైన్ క్లియర్ కానుంది. ఆన్‌లైన్ దరఖాస్తు, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ పూర్తవ్వడంతో ఇక చివరి దశ సీట్లు, కళాశాల ఎంపికకు సంబంధించి మంగళవారం విద్యార్థుల సెల్‌ఫోన్‌కు సమాచారం రానుంది. రాష్ట్రంలో ఉన్న వర్సిటీల నుంచి సీట్ల సంఖ్యపై ఉన్నత విద్యామండలికి నివేదిస్తేనే అక్కడ నుంచి కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ వస్తుంది. రాష్ట్రంలో అత్యధిక కళాశాలలకు అనుసంధానంతో పాటు సాంకేతిక వర్సిటీల్లో కీలకంగా ఉన్న జేఎన్‌టీయూకే ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేసింది. వర్సిటీ అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ సాయిబాబు నేతృత్వంలో ప్రక్రియ పూర్తి చేసి నివేదిక పంపించారు. ప్రస్తుతం తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం ఉమ్మడి జిల్లాల్లోని కళాశాలలు వర్సిటీకి అనుబంధంగా ఉన్నాయి.

సీఎస్‌ఈ వైపు మొగ్గు

2024–25 విద్యాసంవత్సరానికి కాకినాడ వర్సిటీ ఉన్నత విద్యామండలికి సీట్ల కేటాయింపు కోసం నివేదించింది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న 159 కళాశాలల్లో ఇంజినీరింగ్‌లో 63,000 భర్తీ చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు. గత ఏడాది బీటెక్ విభాగంలో డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ కోర్సు కోసం నాలుగు వేల సీట్లకు అనుబంధ కళాశాలలు దరఖాస్తు చేసుకోగా అక్కడి సౌకర్యాలను బట్టి వాటికి అనుమతి ఇచ్చారు. కొత్త కోర్సులకు సంబంధించి ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో వీఎల్ఎస్ఐ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ కోర్సులకు 1,500 సీట్ల వరకూ అనుమతి ఇచ్చారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ మెయిన్స్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఐఐటీ, ఎన్ఐటీలలో సీటు సాధించలేకపోయిన విద్యార్థులు ఏపీ ఈఏపీ సెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లు సాధించారు. వీరు ప్రైవేట్ వర్సిటీలతో పాటు ఏ గ్రేడ్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ బ్రాంచ్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు.

ఆన్‌లైన్‌లో కళాశాలల తనిఖీ...

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు అనుబంధ కళాశాలల తనిఖీలు ఆన్‌లైన్‌లో చేపట్టారు. మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, కళాశాల స్థితిగతులు, వసతులు, విద్యార్థి – అధ్యాపకుల నిష్పత్తి, కళాశాల క్యాంపస్ పరిస్థితి, ఆటస్థలం, గ్రంథాలయ సదుపాయం, ల్యాబ్ తదితర అంశాలను పరిశీలన చేస్తారు. ఏటా ఇంజినీరింగ్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ఇచ్చే ముందు నిజ నిర్ధారణ కమిటీ పర్యవేక్షణ చేస్తుంది. కమిటీ సిఫారసు మేరకు ఏయే కళాశాలలకు ఎన్ని సీట్లు కేటాయించాలి అనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. మరోవైపు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్న ఇంజినీరింగ్ కాలేజీలకు ఎన్ని సీట్లుకు యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు ఇస్తుందనే అంశానికి నిజ నిర్ధారణ కమిటీ సిఫార్సులే కీలకం. ఈ కమిటీలో వర్సిటీ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సభ్యులుగా ఉంటారు.

సదుపాయాలు ఉన్న కళాశాలలకే గుర్తింపు



ఉన్నత విద్యామండలి రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీలు, కళాశాలల ప్రమాణాలను ఆన్‌లైన్ ద్వారా పరిశీలన చేసి అనుమతి ఇవ్వాలని సూచించింది. ఆ మేరకూ జేఎన్‌టీయూ కాకినాడ నుంచి ఆన్‌లైన్‌లో పరిశీలన నిర్వహించాం. సాంకేతిక విద్యలో ఉన్నత ప్రమాణాలు పాటించిన, అన్ని వసతులు ఉన్న వాటికే గుర్తింపు కల్పించాం. అటువంటి కళాశాలల్లో అభ్యసిస్తే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, తాజా మాజీ వీసీ, జేఎన్‌టీయూ కాకినాడ

ఈ రెండు నెలలే కీలకం



కాటన్ బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న మిగులు జలాలు

- జూలై , ఆగస్టులలో ప్రమాద స్థాయిలో గోదావరి
- గడిచిన పదేళ్లలో జూలైలో నాలుగుసార్లు, ఆగస్టులో మూడు సార్లు ప్రమాద స్థాయిలో వరద గోదావరి
- వరదలను ఎదుర్కొనేందుకు ఇరిగేషన్ యంత్రాంగం సన్నద్ధం

ధవళేశ్వరం: జూలై ,ఆగస్టు నెలల్లో ప్రమాద స్థాయికి గోదావరి చేరుతుంది. గత పదేళ్లను పరిశీలిస్తే ఏడు సార్లు జూలై, ఆగష్టు నెలల్లోనే వరదలు సంభవించాయి. గోదావరి పరీవాహక ప్రాంతాలతో పాటు మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో గత వారం రోజులుగా కాటన్ బ్యారేజీ వద్ద నీటి ఉధృతి క్రమేపి పెరుగుతూ వస్తోంది. దీంతో కాటన్ బ్యారేజీ నుంచి మిగులు జలాల విడుదలను పెంచారు. జూలై, ఆగస్టు నెలలంటేనే లంక ప్రాంత వాసులకు వెన్నులో వణుకు పుడుతుంది. ఉభయ గోదావరి జిల్లాలను అతలాకుతలం చేసిన 1986 వరదలు కూడా ఆగస్టు నెలలోనే సంభవించాయి. దీంతో ఈ రెండు నెలలు లంక ప్రాంత వాసులు, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉంటారు. గడిచిన 70 ఏళ్ల వరదలను పరిశీలిస్తే ఒక్క 2015 సంవత్సరంలో మాత్రమే జూన్‌లో గోదావరికి అత్యధికంగా వరదలు వచ్చాయి. 2015 సంవత్సరం జూన్ 23వ తేదీన 10 అడుగులకు నీటి మట్టం చేరగా 8,08,287 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఆ ఏడాది ఇదే అత్యధిక వరద నీటి మట్టం.

జూలైలో నాలుగు సార్లు.. ఆగస్టులో మూడు సార్లు

గడచిన పదేళ్లను పరిశీలిస్తే గోదావరికి అత్యధిక వరదలు జూలైలో నాలుగు సార్లు, ఆగస్టులో మూడు సార్లు సంభవించాయి. ఇందులో 2016, 2017, 2022, 2023వ సంవత్సరాలలో జూలైలో గోదావరికి ప్రమాద స్థాయిలో వరదలు సంభవించాయి. 2018, 2019, 2020వ సంవత్సరాలలో ఆగస్టులో గోదావరికి ప్రమాద స్థాయిలో వరదలు వచ్చాయి.

గడిచిన పదేళ్లలో గోదావరికి సంభవించిన వరదల వివరాలు

తేదీ	అత్యధిక నీటి మట్టం	మిగులు జలాలు (క్యూసెక్కులు)
09-09-2014	16.10	16,56,782
23-06-2015	10.00	8,08,287
13-07-2016	14.80	14,70,903
21-07-2017	9.40	5,66,324
22-08-2018	15.35	15,29,130
10-08-2019	15.60	15,61,404
18-08-2020	19.90	22,58,895
10-09-2021	12.00	10,19,452
17-07-2022	21.70	25,80,963
30-07-2023	16.00	16,32,780

లంక వాసులకు వణుకే : గోదావరి వరదలతో ఈ రెండు నెలలు లంక వాసుల కు వెన్నులో వణుకు పుడుతుంది. బ్యారేజీ దిగువన అనేక లంక గ్రామాలు ఉన్నాయి. ఇందులో బ్యారేజీ వద్ద మొదట ప్రమాద హెచ్చరిక స్థాయి 10లక్షల క్యూ సెక్కుల మిగులు జలాలు విడుదల చేస్తున్న సమయంలో పలు లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటాయి. మూడవ ప్రమాద హెచ్చరిక స్థాయికి వచ్చేసరికి పూర్తి స్థాయిలో లంక గ్రామాలు నీట మునుగుతాయి.

వరదలను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నాం

గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు ఇరిగేషన్ యంత్రాంగం సన్నద్ధంగా ఉంది. ఇప్పటికే ఫ్లడ్ స్టోర్స్‌లో సామగ్రి సిద్ధంగా ఉంచాం. వరదలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్ర స్థాయి అధికారులకు సూచనలు ఇచ్చాం. ధవళేశ్వరంలో ఉన్న ఫ్లడ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు వరదల పరిస్థితిని సమీక్షిస్తాం.

-జి.శ్రీనివాసరావు, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ, ధవళేశ్వరం

భజే విఘ్నేశ్వరా..



అయినవిల్లి ఆలయంలో భక్తుల క్యూ

అయినవిల్లి: భజే గణనాయకా అంటూ ఆ విఘ్నేశ్వరుడిని భక్తజనం కొలిచింది. ఆదివారం సెలవు దినం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ చేశారు. అనంతరం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 45 మంది, లక్ష్మీగణపతి హోమంలో 18 మంది దంపతులు పాల్గొన్నారు. 11 మంది నూతన వాహన పూజలు, చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాలు, తులాభారం నిర్వహించారు. ముగ్గురు తలనీలాలు సమర్పించారు. స్వామివారి అన్నదాన పథకంలో 1,575 మంది అన్నప్రసాదం స్వీకరించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.1,90,785 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

భారత వైమానిక దళంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోండి

క్యూఆర్ కోడ్

రాజమహేంద్రవరం సిటీ: భారత వైమానిక దళంలో చేరడానికి ఆసక్తి, తగిన విద్యార్హత కలిగిన యువతీ యువకుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం తెలిపారు. అర్హతలు, ఎంపిక ప్రక్రియపై ఎయిర్ ఫోర్స్ నాన్ కమీషన్డ్ అధికారి ఎస్.సందీప్ సమగ్ర సమాచారాన్ని తెలియజేశారని కలెక్టర్ తెలిపారు. అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్వాయు ఇంటేక్ కోసం ఎంపిక పరీక్షకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. జూలై 28 రాత్రి 11 గంటలలోగా దరఖాస్తు చేసుకున్న అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ ఏడాది అక్టోబర్ 18న పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు 2004 జూలై 3వ తేదీ నుంచి 2008 జనవరి 3వ తేదీ మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ప్రవేశ స్థాయి అర్హత, వైద్య ప్రమాణాలు, నిబంధనలు, షరతులు, ఆన్‌లైన్ దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ కోసం సూచనలపై వివరణాత్మక సమాచారం కోసం అగ్నివీరవాయు ఇన్‌టాక్ డాక్ డాట్‌ఇన్ వెబ్‌సైట్ ను సందర్శించాలన్నారు. మరింత సమాచారం, దరఖాస్తు నమోదు కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పొందవచ్చునని తెలియజేశారు.

జిల్లావ్యాప్తంగా భారీ వర్షం



కొవ్వూరులో రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. తాళ్లపూడిలో గరిష్టంగా 54.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, నిడదవోలు, గోకవరం మండలాల్లోను భారీ వర్షం నమోదైంది. జిల్లాలో ఆదివారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో 29.6 మిల్లీమీటర్లు సరాసరి వర్షపాతం నమోదైంది. గోకవరంలో 49.8, దేవరపల్లి 50.2, గోపాలపురం 49.0, నల్లజర్ల 48.6, నిడదవోలు 40.0 మి.మీటర్లు చొప్పున వర్షం కురిసింది. అనపర్తి 11.2, బిక్కవోలు 4.2, కడియం 28.6, కోరుకొండ 25.6, రాజమహేంద్రవరం అర్బన్ 35.6, రాజమహేంద్రవరం రూరల్ 24.8, రాజానగరం 16.2, రంగంపేట 14.0, సీతానగరం 24.6, చాగల్లు 39.2, కొవ్వూరు 15.4, పెరవలి 13.8, ఉండ్రాజవరం 11.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. సోమ, మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచిస్తోంది.

హాస్టల్‌కు రాం... రాం

- చేరేందుకు విద్యార్థుల ససేమిరా
- బీసీ సంక్షేమ గృహాల్లో నిర్వహణ కరవు
- అడుగడుగునా సమస్యల చిట్టా



పుల్లేటికుర్రులో విద్యార్థులు లేక నిరుపయోగంగా ఉన్న వసతి గృహం

కాట్రేనికోన: 'జీవితంలో యవ్వనం కన్నా... ఆనంద డోలికల్లో తేలియాడే బాల్యం మిన్న' అన్నారో మహాకవి. అటువంటి బాలలను కంటికి రెప్పలా కాపాడి, వసతి కల్పించాల్సిన బీసీ సంక్షేమ హాస్టళ్లు అవస్థలమయంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యంతో కనీస నిర్వహణకు దూరమయ్యాయి. అధ్వాన మరుగుదొడ్లు, కానరాని కిటికీలు, దోమలతో అవస్థలు, అందని రక్షిత జలాలు.. ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం కనీసం పట్టించుకోక ఇక్కడకు 'మేం రాం.. బాబోయ్' అంటూ విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏడు బాలుర, రెండు బాలికల బీసీ సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. ఆయా చోట్ల చేరికలు నామమాత్రంగానే జరుగుతున్నాయి.

ఇదీ వసతి తీరు..

కాట్రేనికోన బీసీ వసతి గృహంలో కనీస సౌకర్యాలు లేవు. ఇక్కడ చేరేందుకు విద్యార్థులు ససేమిరా అంటున్నారు. ఐ.పోలవరం బీసీ హాస్టళ్లలోనూ అదే పరిస్థితి. ఈ రెండు చోట్లా వాటర్ ప్యూరిఫై మెషీన్లు నిరుపయోగంగా ఉండటంతో రక్షిత నీరు విద్యార్థులకు దూరమైంది. మరుగుదొడ్లకు తలుపులు లేక, వాటి శుభ్రం పట్టించుకోక దుర్వాసన వెదజల్లుతోంది. విద్యుత్ మోటార్లు పని చేయకపోవడంతో నీరులేక మరుగుదొడ్లకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూమ్స్ లేక ఆరు బయటే సామూహిక స్నానాలు చేస్తున్నారు. కిటకీలకు తలుపులు, దోమ తెరలు లేక దోమ కాటుకు గురవుతున్నారు. గత ఏడాది కాట్రేనికోన వసతి గృహంలో 83 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పుడు 36 మందికి చేరింది. ఇక్కడ బెడ్స్ లేక నేలపైనే విద్యార్థులు నిద్రిస్తున్నారు. కాట్రేనికోనలో వార్డెన్‌తో పాటు పర్మినెంట్ సిబ్బంది ఒకరు, ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించాలి. ఈ సమస్యలపై సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి, బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి జ్యోతిలక్ష్మీదేవిని 'సాక్షి' వివరణ కోరగా సంబంధిత అధికారులతో సమీక్షించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



కాట్రేనికోన బీసీ వసతి గృహంలో పాడైన మరుగుదొడ్ల తలుపులు



ఐ.పోలవరం బీసీ వసతి గృహంలో పనిచేయని వాటర్ ఫిల్టర్

అడ్మిషన్లు.. అందుకోని లక్ష్యాలు

ప్రతి వసతి గృహంలోనూ కనీసం వంద మంది విద్యార్థులు చేరవచ్చు. అయితే ప్రస్తుతం అడ్మిషన్లు బాగా తక్కువగా జరిగాయి. జిల్లాలోని తొమ్మిది బీసీ సంక్షేమ హాస్టళ్లలో 260 మంది విద్యార్థినీ విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పుల్లేటికుర్రులో అధునాతన భవనం ఉన్నా సంబంధిత అధికారుల అలసత్వంతో ఇక్కడ పిల్లలు లేక నిరుపయోగంగా ఉంది. అంతర్వేదిలోని వసతి గృహంలో 24 మంది, రాజోలులో 36, అమలాపురంలో 32, కాట్రేనికోనలో 36, ముమ్మిడివరంలో 49, ఐ.పోలవరంలో 38 మంది ఉన్నారు. బాలికల వసతి గృహాలైన అమలాపురంలో 31, మండపేటలో 14 మంది మాత్రమే విద్యార్థినులు చేరారు. మొత్తం 9 వసతి గృహాలకు నాలుగు సొంత, ఐదు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయి. వసతి గృహాల్లో విద్యార్థులకు రక్షిత నీటిని అందించాలనే లక్ష్యంతో గత కలెక్టర్ హిమాన్షు శుక్లా చమురు సంస్థల సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన వాటర్ ఫిల్టర్లు అలంకారప్రాయంగా మారాయి.

క్లుప్తంగా

వచ్చే నెల 26న బ్యాడ్మింటన్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): డాక్టర్ స్వర్ణన్‌రాజు స్మారక జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆగస్టు 26న నిర్వహించనున్నట్లు వైఎంసీఏ కాకినాడ శాఖ కార్యదర్శి జీవీవీకే గాంధీ ఆదివారం తెలిపారు. 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు జూనియర్స్‌గా, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు సీనియర్స్‌గా సింగిల్స్, డబుల్స్‌లో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. కాకినాడలోని ద్రాణా బ్యాడ్మింటన్ అకాడమీలో పోటీలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 99635 54688, 95358 68625 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వైఎంసీఏ నగర అధ్యక్షుడు పీఎం హెన్రీ వివరించారు.

16, 17 తేదీల్లో మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీలు

జిల్లా మోడ్రన్ పెంటాథ్లాన్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో రాష్ట్ర స్థాయి మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంటేశ్వరరావు తెలిపారు. ట్రయాథ్లాన్ విభాగంలో రన్నింగ్, లేజర్‌గన్, షూటింగ్, స్విమ్మింగ్ లోనూ, బయాథ్లాన్‌లో రన్నింగ్, స్విమ్మింగ్, రన్నింగ్‌లో అండర్-9 నుంచి అన్ని వయసుల వారు పాల్గొనవచ్చన్నారు. జూనియర్స్, సీనియర్స్, ఓపెన్ విభాగంలో ప్రతిభ కనబరిచిన వారు ఆగస్టు 14 నుంచి 18 వరకూ ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఆసక్తి గల వారు 98484 11027 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

సత్యదేవుని సన్నిధిలో రాష్ట్ర సమాచార కమిషనర్



చావలి సునీల్‌కు సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ కృష్ణారావు

అన్నవరం: రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆయనకు ఆలయం వద్ద పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆయనకు వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా, స్వామివారి ప్రసాదాలను ఏఈఓ కృష్ణారావు ఇచ్చారు.

మోటార్‌సైకిల్ డిక్కీలో నల్లతాచు



పామును బంధిస్తున్న స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ

అమలాపురం రూరల్: పెట్రోల్ బంకు వద్దకు ఓ వ్యక్తి వెళ్లి మోటారు సైకిల్ డిక్కీ తెరవబోతుంటే నల్ల తాచుపాము పిల్ల కనబడటంతో ఆందోళన చెందాడు. ఆ వివరాల్లోకి వెళ్తే.. అమలాపురం మండలం వేమవరం పెట్రోల్ బంకు వద్దకు కాలెం దుర్గారావు ఆదివారం సాయంత్రం పెట్రోల్ వేయించుకోవడానికి వచ్చారు. సీటు డిక్కీ తెరవబోతుంటే నల్ల తాచుపాము పిల్ల కనబడడంతో వెంటనే పక్కకు వచ్చేశారు. స్థానికుల సహాయంతో ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలో ఉన్న స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు ఫోన్ చేయగా వెంటనే అతను వచ్చి పామును పట్టుకుని డబ్బాలో బంధించారు.

పెద్దాసుపత్రిలో యమపాశాలు

- కాకినాడ జీజీహెచ్‌లో విద్యుత్తు ప్రమాదాలు
- అస్తవ్యస్తంగా నిర్వహణ వ్యవస్థ
- ఇప్పటికే ఇద్దరు బలి, రూ.లక్షల నష్టం
- నిర్లక్ష్యంగా ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్

కాకినాడ క్రైం: ఎందరో ప్రాణాలు నిలిపే పెద్దాసుపత్రి అది.. అక్కడే విద్యుత్తు తీగల రూపంలో యమపాశం ఎదురుచూస్తోంది.. కాకినాడ జీజీహెచ్‌లో విద్యుత్ విభాగం నిర్లక్ష్యం కొందరికి ప్రాణసంకటంలా మారింది. ఈ తీవ్రత పెరిగి పెద్దదై రోగుల ప్రాణాల మీదకొస్తుంది. వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు చీమకుట్టినట్లైనా ఉండడం లేదు. ఏదైనా ఘటనలు జరిగినప్పుడు వచ్చి చూడడం, అది చేస్తాం, ఇది చేస్తామంటూ హామీలు ఇచ్చి వెళ్లిపోవడం పరిపాటైంది. విద్యుత్ విభాగంతో పాటు ఏపీఎంఎస్ ఐడీసీ నిర్లక్ష్యం ఆదివారం మరో ప్రాణాన్ని బలిగొంది. విధి నిర్వహణలో ఉన్న పారిశుధ్య కార్మికుడి మృతి ఆ నిరుపేద కుటుంబాన్ని రోడ్డున పడేసింది.

అమ్మో... హడల్

అధికారుల నిర్లక్ష్యం కారణంగా జీజీహెచ్‌లో విద్యుత్, సంబంధిత ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రూ.లక్షల ఆస్తితోపాటు ప్రాణ నష్టం చోటు చేసుకుంటుంది. కొన్నాళ్ల కిందట జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి సర్వీస్ కోసం స్తంభం ఎక్కి ఎలక్ట్రికల్ షాక్‌కు గురై కిందిపడి బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. మెడిసిన్ డిస్పెన్సరీ కౌంటర్‌లో చోటు చేసుకున్న షార్ట్ సర్క్యూట్ వల్ల రూ.లక్షల విలువ చేసే ఔషధాలు, ఉపకరణాలు కాలి బూడిదయ్యాయి. కొన్నాళ్ల కిందట చంటిపిల్లల ఐసీయూలో చోటు చేసుకున్న ఈ ప్రమాదం రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశమైంది. షార్ట్ సర్క్యూట్ కారణమైన ఈ ప్రమాదంలో ప్రాణాపాయంతో విలవిలలాడుతున్న పిల్లల్ని కూడా ఆక్సిజన్ మాస్కులు ఎక్కడికక్కడ తీసేసి తల్లిదండ్రులు తమ పిల్లల్ని రక్షించుకున్నారు. కొద్ది నెలల కిందట జీజీహెచ్ ఏఎంసీలో చోటుచేసుకున్న షార్ట్ సర్క్యూట్ రోగులకు ప్రాణభయాన్ని పుట్టించింది. వారు పరుగులు తీసేలా చేసింది. ఈ ఘటనలో నర్సులు, వైద్యులు విధులు నిర్వహించే ప్రదేశం వద్ద ఉన్న ఏసీ మంటల్లో చిక్కుకుంది. ఆదివారం పారిశుధ్య వర్కర్ గోవింద్ జనరేటర్ వద్ద చెత్తను తుడుస్తూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.



గైనిక్ విభాగం వద్ద ఎటువంటి భద్రత ఏర్పాట్లు లేని కంట్రోల్ ప్యానల్ బోర్డులు



గోవింద్ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు



సర్జికల్ ల్యాబ్ వద్ద ప్రమాదకరంగా విద్యుత్ కేబుల్స్



ఆర్థోపెడిక్ వార్డులో రోగి బెడ్ పక్కనే ప్రమాదకరంగా పవర్ డిస్ట్రిబ్యూషన్ బాక్స్



డిపార్టుమెంట్ ఆఫ్ మెడిసిన్ వద్ద ఇలా...

తెరుచుకున్న మృత్యుకుహరాలు

జీజీహెచ్‌లోని వార్డులను పరిశీలిస్తే విద్యుత్ నిర్వహణ వ్యవస్థ ఎంత అధ్వానంగా ఉందో స్పష్టమవుతోంది. వార్డుల్లో బోర్డులన్నీ నోళ్లు తెరుచుకుని మృత్యుకుహరాలను కనిపిస్తున్నాయి. పొరపాటున చేయి తలిగినా అక్కడికక్కడే మనిషి మరణం ఖాయం అనేంత దారుణ స్థితిలో ఉన్నాయి. వార్డులే కాదు, ఆరుబయట నుంచే ఈ నిర్లక్ష్యం దర్శనమిస్తోంది. ప్యానల్ బోర్డుల నిర్వహణ కూడా అలానే ఉంది. వర్షాలు పడితే మరిన్ని ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. ఆసుపత్రిలో జనసంద్రం ఉండే చోట్ల కూడా తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. కొద్ది నెలల కిందట ఏఎంసీయూలో ప్రమాదం జరిగినా, ఆ పక్కనే ముట్టుకుంటే చావు పక్కా అనే రీతిలో విద్యుత్ తీగలు భయానకంగా వేలాడుతుండడం జీజీహెచ్ విద్యుత్ విభాగం సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నాయి. వార్డుల ఆవరణలో రోగుల బంధువులు సేద తీరే ప్రాంతాలన్నీ మృత్యుకుహరాలే. ఏ మాత్రం అలక్ష్యంగా ఉన్నా అంతే. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు నిద్ర వీడాలని రోగులు, సహాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సెప్టెంబర్ 28, 29 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (మంగళగిరి) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28, 29 తేదీల్లో టైప్ పరీక్షలను నిర్వహించనున్నట్లు గోదావరి ట్విన్ ఆర్ట్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి డీఎంవీ ప్రసాద్ తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు భాషల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్, హైస్పీడ్ పరీక్షలను, ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్ పరీక్ష, హిందీలో లోయర్, హైయ్యర్ గ్రేడ్ పరీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా 35 కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. తెలుగు, ఇంగ్లిష్ షార్ట్ హ్యాండ్ పరీక్షలను సెప్టెంబర్ 21, 22 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరు కేంద్రాల్లో జరుపుతామన్నారు. విజయవాడలోని షార్ట్ హ్యాండ్ కేంద్రాన్ని రద్దు చేసి, గుంటూరుకు మార్పు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 75 రోజుల సమయం ఉందని, వెంటనే సమీప టైప్ ఇనిస్టిట్యూట్‌లను సంప్రదించి, ఈ నెల 31వ తేదీ లోగా ఫీజులు చెల్లించాలన్నారు.

చింతలూరులో విషాదం



వీరి మురళీకృష్ణ (ఫైల్)

ఆలమూరు: మండలంలోని చింతలూరుకు చెందిన వీరి మురళీకృష్ణ (24) మృతితో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. ఈ నెల 11న విహారయాత్రకు వెళ్లిన అతను మోతుగూడెంలోని పుష్ప ఘాట్ బ్రిడ్జి వద్ద పవర్ కెనాల్‌లో ప్రమాదవశాత్తూ జారిపడి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి అక్కడి పోలీసులు, స్థానికులు గజ ఈతగాళ్ల గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం మురళీకృష్ణ మృతదేహం అభించింది. స్వగ్రామానికి అతని మృతదేహాన్ని తీసుకురావడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మురళీకృష్ణకు వివాహం చేద్దామనుకుంటున్న తరుణంలో మృత్యువాత పడడాన్ని తల్లిదండ్రులు గోవిందు, సూర్యమణి, సోదరుడు దుర్గారావు జీర్ణించుకోలేక పోతున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో బోరున విలపిస్తున్నారు. స్నేహితుడు మురళీకృష్ణ మృతదేహాన్ని చూసిన సహచరులు తీవ్ర మనోవేదనకు లోనయ్యారు.

అక్రమ మద్యం స్వాధీనం



గోవలంక వద్ద స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడితో పోలీసులు

తాళ్లరేవు: యానాం నుంచి కాట్రేనికోన మండలం బలుసుతిప్పకు అక్రమంగా తరలిస్తున్న 2,340 బాటిళ్ల మద్యాన్ని తాళ్లరేవు మండలం గోవలంక వద్ద ఆదివారం పట్టుకున్నామని కోరంగి ఎస్సై ఎస్. రవికుమార్ తెలిపారు. గోవలంక ఇసుక ర్యాంపు వద్ద బోటులోకి ఎక్కించేందుకు సిద్ధంగా ఉంచిన సుమారు 13 బస్తాల్లోని మద్యం సీసాలను, తరలించేందుకు వినియోగించిన బోటును స్వాధీనం చేసుకున్నామన్నారు. బలుసుతిప్పకు చెందిన దండుప్రోలు సతీష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వద్దకు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎస్సైతో పాటు హెడ్ కానిస్టేబుల్ చిట్టిబాబు, పీసీ సురేష్, చందు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సుబ్బారావు (ఫైల్)

సీతానగరం: సీతానగరానికి చెందిన పెంటా సుబ్బారావు (60) ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య కథనం ప్రకారం.. డయేరియాతో ఈ నెల 2న స్థానిక పీహెచ్‌సీలో సుబ్బారావు చికిత్స పొందాడు. మూడు రోజుల్లో కోలుకున్నాడు. 6న ఆయాసం రావడం, మూత్రం బంద్ కావడంతో కుటుంబ సభ్యులు సీతానగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం రాజమహేంద్రవరానికి తరలించారు. 10న ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా ఉండటంతో కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లారని, ఇన్ పేషెంట్‌గా అడ్మిట్ చేయాలని ఆసుపత్రి వర్గాలు చెప్పడంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువచ్చారని చైతన్య అన్నారు. అప్పటి నుంచి ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆయనకు మూత్ర పిండాలు పని చేయకపోవడం, తదితర కారణాలతో ఆదివారం మృతి చెందాడని వివరించారు. ఇదిలాఉంటే ఈ విధంగా ఇటీవల ఒకరు మృతి చెందడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలోని మామిడి తోటలో విక్రయించేందుకు సిద్ధం చేసిన 60 కిలోల గంజాయిని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ధర్మవరానికి చెందిన వనం ఏసుబాబు, కిర్లంపూడి మండలం సింహాద్రిపురానికి చెందిన కందా సూర్యనారాయణలను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడని సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గోపాలపురం కొయ్యలగూడెం రోడ్డులో మృతి చెందిన ప్రసాద్

గోపాలపురం: రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్ట్ మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జగన్నాథపురం గ్రామానికి చెందిన చాపర్ల ప్రసాద్(55) గోపాలపురం పనిపై వచ్చి తిరిగి మోటార్ సైకిల్‌పై బయలు దేరాడు. ఈ నేపథ్యంలో గోపాలపురం కొయ్యలగూడెం రోడ్డులో పేలస్ హోటల్ వద్ద మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ప్రసాద్ ఎదురుగా వస్తున్న లారీ వెనుక భాగంలో పడిపోయాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు.

ఆనందం.. అంతలోనే ఆవిరి..

- కుమారుడి పుట్టిన రోజున విషాదం
- తల్లి మృతి, తండ్రికి గాయాలు
- నల్లజర్లలో హృదయవిదారక ఘటన



సొలస సుబ్బలక్ష్మి (ఫైల్)

నల్లజర్ల: కుమారుడి పుట్టినరోజు కావడంతో ఆనందంగా గడిపిన క్షణాలు మరువకుండానే, ఆ భార్యాభర్తలు అనుకోని ప్రమాదం బారిన పడ్డారు.. ఈ ఘటనలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. నల్లజర్లలో ఈ హృదయ విదారక ఘటన జరిగింది. తాడేపల్లిగూడెం బేబీ సెంటర్‌కు చెందిన సొలస బసవరాజు, సుబ్బలక్ష్మి దంపతులు. వీరి పెద్ద కుమారుడు సత్యశ్రీనివాస్ పుట్టినరోజు శనివారం కావడంతో కారులో ద్వారకాతిరుమల స్వామివారి దర్శనానికి బయలు దేరారు. మార్గమధ్యంలో అనంతపల్లిలో ఆగి శ్రీనివాస్ తన అక్క దేవీశిరీషను కారులో ఎక్కించుకుని ద్వారకాతిరుమల వెళ్లి దర్శనం చేసుకున్నారు. తిరిగి వస్తుండగా నల్లజర్లలో ఆగి లక్ష్మీ మల్టీప్లెక్స్‌లో కల్కి సినిమా చూశారు. అనంతరం దేవీశిరీషను అనంతపల్లిలో దింపి వస్తానని, తల్లిదండ్రులను అక్కడే నిలబడి ఉండమని చెప్పి సత్యశ్రీనివాస్ కారులో వెళ్లాడు. ఇంతలోనే బసవరాజు, సుబ్బలక్ష్మి దంపతులు డివైడర్ దాటి ఇవతలకు వస్తుండగా ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటనతో వీరిద్దరూ పైకి ఎగిరిపడ్డారు. తీవ్ర గాయాలతో ఉన్న వీరిని అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం తీసుకు వెళ్తుండగా సుబ్బలక్ష్మి (53) మార్గ మధ్యంలో మృతి చెందింది. బసవరాజుకు రెండు కాళ్లు విరిగిపోయాయి. ఈ మేరకు సీఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి టీటీ పోటీలు



ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో మూడు రోజులుగా జరుగుతున్న ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అండర్ 11, 13, 15 బాల, బాలికల విభాగాల్లో ఉత్కంఠ భరితంగా పోటీలు సాగాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు విశ్వనాథం భాస్కరరామ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఏపీటీటీఏ కార్యదర్శి పి.విశ్వనాథ్, గుంటూరు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గురుదత్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్-11 బాలికల విభాగంలో విజయవాడకు చెందిన ఎస్.మనస్విని (ప్రథమ), కొల్లి హెత్విక (ద్వితీయ), బాలుర విభాగంలో జి.తరుణ్‌తేజ (విజయవాడ) ప్రథమ, భువన్ (విజయవాడ) ద్వితీయ, అండర్-13 బాలికల్లో పల్నాడుకు చెందిన స్ఫూర్తినైనా (ప్రథమ), విశాఖపట్నానికి చెందిన సేవితశ్రీ (ద్వితీయ), బాలుర విభాగంలో వేదాష్ (విజయవాడ), హార్దిక్‌రామ్ (విశాఖపట్నం)లు, అండర్-15 బాలికల విభాగంలో విశాఖపట్నానికి చెందిన రేణుక సత్యా (ప్రథమ), పెద్దాపురం సినర్జీ అకాడమీకి చెందిన దర్శిక (ద్వితీయ), బాలుర విభాగంలో అనంతపురానికి చెందిన జతిన్‌రెడ్డి (ప్రథమ) పెద్దాపురానికి చెందిన అశ్విన్ (ద్వితీయ) బహుమతులను సాధించారు. రాజమహేంద్రవరం గౌతమీ టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన మోహిత్ శ్రీకపిష్ అండర్-11 బాలుర విభాగంలో సెమీ ఫైనల్స్ చేరి బ్రాంజ్ మెడల్ సాధించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జీవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ పాల్గొనగా, కార్యదర్శి వీటీవీ సుబ్బారావు టోర్నమెంట్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తోటలను ముంచి.. ఆశలను తుంచి

- అధిక వర్షాలకు దెబ్బతింటున్న పూల వనాలు
- తెగుళ్లు సోకి చనిపోతున్న మొక్కలు
- దిగుబడి తగ్గి నష్టపోతున్న రైతులు



కాకరపర్రు మార్కెట్‌లో అంతంత మాత్రంగా పూల విక్రయాలు



కాకరపర్రులో మొగ్గలు విచ్చుకోని లిల్లీపూల తోట



తీపర్రులో పాడైన గులాబీ పంట

పెరవలి: పూలు తోటలకు కష్టాలొచ్చాయి.. ఈ పంటలను భారీ వానలు నిలువునా ముంచేస్తున్నాయి.. దిగుబడి వచ్చే సమయంలో రైతుల ఆశలను తుంచేశాయి.. పెట్టుబడి కూడా రాక నష్టాలు మిగులుస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లా పూల సాగుకు ప్రసిద్ధి. ఇక్కడ సుమారు రెండు వేల ఎకరాల్లో తోటలు ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం, కడియపులంక, వేమగిరి, పొట్టిలంక, పెరవలి మండలం కాకరపర్రు, తీపర్రు, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో సాగు చేస్తున్నారు. ఈ మండలాల్లో ప్రధానంగా గులాబీ, చామంతి, కనకాంబరం, లిల్లీ, జాజి, సన్నజాజులు, మల్లె పూల తోటలు ఎక్కువగా పండిస్తున్నారు. అధిక వర్షాలు పూల తోటలను దెబ్బతీస్తున్నాయి. దీనివల్ల పూల మొగ్గలు విచ్చుకోవడం లేదని, ఫలితంగా నాణ్యమైన పూల ఉత్పత్తి జరగడం లేదని రైతులు అంటున్నారు. జాజి పూల తోటల్లో ఎకరానికి పది కిలోల దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం రెండు నుంచి మూడు కిలోలు మాత్రమే వస్తున్నాయని చెబుతున్నారు. నాణ్యత లేని పూలకు మార్కెట్‌లో కోత కూలి కూడా రావడం లేదంటున్నారు. గతంలో రోజూ పూల కోతకు వెళ్లేవారమని, వర్షాలు మొదలయ్యాక మూడు రోజులకు ఒకసారి పని దొరుకుతోందని కూలీలు చెబుతున్నారు.

తోటలు.. దెబ్బతీస్తున్న తెగుళ్లు

వర్షాలతో పూల తోటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. చేలల్లో నీరు నిల్వ ఉండటంతో ఊటబారిన పడి మొక్కలు చనిపోతున్నాయి. కొన్నిచోట్ల తెగుళ్లు సోకుతున్నాయి. ఈ తోటలకు నల్లి, ఆకుమచ్చ తెగుళ్లు, కాండం, వేరు కుళ్లు బారిన పడడమే కాకుండా, మొగ్గ తొలుచు పురుగు వ్యాపిస్తుంది. లిల్లీ పూలకు బ్యాక్టీరియా తెగులు సోకుతుంది. ముఖ్యంగా మల్లె, లిల్లీ, కనకాంబరం, బంతి, చామంతి వంటి పూల తోటల్లో మొగ్గలు విచ్చుకోవడం లేదని చెబుతున్నారు. ఈ పంటలను కాపాడుకోవటానికి ఎకరానికి అదనంగా రూ.10 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందంటున్నారు.

20 వేల మందికి ఉపాధి

జిల్లాలోని రెండు వేల ఎకరాల్లో 1,600 మంది రైతులు పూల తోటలు పండిస్తున్నారు. ఈ సాగుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మంది ఆధారపడ్డారు. రైతులు, పూల కోత కూలీల నుంచి.. దండలు కట్టేవారు, వ్యాపారులు, పూల దుకాణ నిర్వాహకులు, సైకిళ్లపై విక్రయించే వారు, ఇలా అనేక మంది ఉపాధి పొందుతున్నారు. కానీ వర్షాలతో వీరందరికీ ఉపాధి కరవైంది.

అయినా నాణ్యత లేక..



నేను రెండు ఎకరాల్లో బంతి, గులాబీ, కనకాంబరం పూల తోటలు వేశాను. వానలతో పంట తెగుళ్ల బారిన పడింది. దీంతో అదనపు పెట్టుబడి పెట్టి కంటి రెప్పలా పూల మొక్కలను కాపాడుకోవాల్సి వస్తుంది. అయినా నాణ్యత లేని పూల దిగుబడి వస్తుంది. ఈ వర్షాలు మమ్మల్ని నష్టాలపాల్జేస్తున్నాయి.

– సంగీతం నారాయణ, పూల రైతు, కాకరపర్రు

కుంగదీస్తున్న వానలు



నేను అర ఎకరంలో బంతి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట చేతికొచ్చింది. ఈ సమయంలో వర్షాలు కుంగదీస్తున్నాయి. రోజుకు 30 కిలోల బంతి పూలు కోసే నాకు 15 కిలోలు కూడా రావడం లేదు. విచ్చుకున్న పూలు కోతకోసే సమయానికి రాలిపోవడం, కొత్త మొగ్గలు రాకపోవటం వంటివి జరుగుతున్నాయి.

– పంపన బుచ్చియ్య, పూల రైతు, కాకరపర్రు

యాజమాన్య పద్ధతులు అవసరం



జిల్లాలో రెండు వేల ఎకరాల్లో వివిధ రకాల పూల సాగు జరుగుతోంది. వర్షాకాలంలో ఈ పంటలకు సాధారణంగా తెగుళ్ల సోకడం, దిగుబడి తగ్గడం జరుగుతోంది. రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటలను కాపాడుకోవచ్చు. ముఖ్యంగా తోటల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఊట బారిన పడిన తోటల్లో సత్వర యాజమాన్య పద్ధతులు పాటిస్తే నష్టాల నుంచి గట్టెక్కవచ్చు.

– సీహెచ్ శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి, నిడదవోలు